## ఆధ్యాత్మిక ప్రవచనాలతోనే మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక ప్రవచనం బోధిస్తున్న మహారాష్ట్రకు చెందిన సుధామ్ మహారాజ్

ఇంద్రవెల్లి, డిసెంబర్ 2: సమాజంలో ఆధ్యాత్మిక ప్రవచనాలతోనే మానసిక ప్రశాంతత ఉంటుందని మహారాష్ట్రకు చెందిన సుధామ్ మహారాజ్ అన్నారు. శనివారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో కార్తీక పూర్ణిమ ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ప్రవచనాలు బోధించారు. హనుమాన్ ఆలయంలో నెలరోజుల పాటు గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో కేస్లాపూర్ గ్రామపటేల్, మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, సర్పంచ్ మెస్రం రేణుకానాగ్‌నాథ్, గ్రామస్తులు బాదిరావ్‌పటేల్, లింబారావ్, షేకు, కోట్నాక్ బారిక్‌రావ్, జంగు, సాగర్, పెందూర్ గణేశ్, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలి ఫిర్యాదు

నార్నూర్, డిసెంబర్ 2 : ఆదివాసీ తెగకు చెందిన కొలాం గిరిజన మహిళను మాయమాటలతో లక్ష రూపాయలు మయం చేసిన ఘటన నార్నూర్ మండలంలో చోటు చేసుకుంది. సుంగాపూర్ కొలాంగూడకు చెందిన కుమ్ర చిన్నుబాయి వివరాల ప్రకారం..గుండాల గ్రామానికి చెందిన అంకుష్ ఏడాది క్రితం నుంచి నా పట్టాపాస్‌బుక్, బ్యాంక్‌ఖాతా, కిసాన్‌కార్డు, ఆధార్‌కార్డును అతని వద్దనే ఉంచుకున్నాడు. ఖాతాలో రైతుబంధు డబ్బులు జమ అయినట్లు చెప్పకుండానే జమ కావడం లేదని, బ్యాంక్ అధికారులు హోల్డ్ పెట్టారని చెబుతున్నాడు. రైతుబంధు డబ్బులు ఎందుకు జమ కావడం లేదని అనుమానం వచ్చి జై భారత్ జిల్లా కోఆర్డినేటర్ పెందోర్ దీపక్‌ను కాలిశాను. దీపక్ బ్యాంక్ ఖాతా స్టేట్‌మెంట్ తీసుకోవడంతో రూ.లక్ష డ్రా చేసినట్లు ఉందని తెలిపింది. ఈ విషయం అంకుష్ తెలపడంతో వారం రోజుల తర్వాత డబ్బులు ఇస్తామని చెప్పాడు. ఇప్పుడు నాకు ఏమి తెలియదు అంటూ చెబుతున్నారని వాపోయారు. శనివారం నార్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. విచారణ చేపట్టి తగు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. విచారణ చేపట్టి తగ్గు చర్యలు తీసుకుంటామని నార్నూర్ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్ఐ కిరణ్ తెలిపారు.

# నిండుకుండలా బోథ్ ప్రాజెక్టు

- ప్రధాన కాలువల్లో నీటి విడుదల
- మొదలైన యాసంగి పంటల సాగు



బోథ్ ప్రాజెక్టులో పుష్కలంగా ఉన్న నీరు

బోథ్, డిసెంబర్ 2 : బోథ్ ప్రాజెక్టు నిండు కుండలా కనిపిస్తున్నది. సాగు నీరు చివరి ఆయకట్టు పొలాలకు అందుతున్నది. ప్రధాన కాలువల్లో నీటి విడుదలతో యాసంగి పంటల సాగుకు రైతాంగం ఉపక్రమిస్తున్నది. కరత్వాడ సమీపంలో పెద్దవాగుపై నిర్మించిన బోథ్ ప్రాజెక్టు (కరత్వాడ ప్రాజెక్టు) మిషన్ కాకతీయ పథకంతో పూర్తి స్థాయిలో సాగు నీటిని అందిస్తున్నది. కుడి, ఎడమ కాలువల ద్వారా 4900 ఎకరాలకు నీరు అందుతున్నది. కుడి కాలువ ద్వారా బోథ్, కరత్వాడ, కుచులాపూర్, ధన్నూర్ (బీ), పొచ్చెర రెవెన్యూ గ్రామ శివారు పరిధిలోని 2950 ఎకరాలకు నీరు అందుతున్నది. ఎడమ కాలువ ద్వారా కరత్వాడ, కన్గుట్ట, బోథ్, కౌఠ(బీ) గ్రామాలకు చెందిన మరో 2950 ఎకరాలకు నీరు పారుతున్నది. మిషన్ కాకతీయ పథకం ద్వారా మొదటి విడుతలో సుమారు రూ.13.17 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకరణ పనులు చేపట్టారు. ప్రధాన కాలువల్లో సిమెంట్ లైనింగ్, అవసనమైన చోట గేట్లు తదితర పనులు చేపట్టారు. అప్పటి నుంచి కాలువల్లో నీరు సులువుగా పారేందుకు వీలు ఏర్పడింది. ప్రస్తుతం వానకాలం పంట కింద సాగు చేసిన సోయా, మినుములు, పెసర పంటలు చేతికి రావడంతో ఆ పొలాల్లో రైతులు మక్క, జొన్న, శనగ పంటలు వేస్తున్నారు. పత్తి, కంది సాగు చేస్తున్న రైతులు ఆ పంటలకు నీటి తడులు ఇస్తున్నారు. నవంబర్ నెల మొదలైనా ప్రాజెక్టులో పుష్కలంగా నీరుండడంతో పాటు ఎగువభాగంలోని వాగుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో యాసంగి పంటలు పూర్తయ్యే వరకు సాగు నీటికి ఢోకాలేదని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అలుగు పారుతున్న నీరు

### నాలుగు ఎకరాల్లో శనగ పంట వేశా....



సోయాబీన్ పంట పూర్తవడంతో నాలుగు ఎకరాల్లో శనగ పంట వేశా. కుడికాలువ ద్వారా మా పొలాలకు నీరు వస్తుండడంతో కాలువలో సబ్‌మెర్సిబుల్ మోటారు పెట్టుకొని నీటి తడులు అందిస్తున్నా. కాలువలు బాగైన నాటి నుంచి నా పొలానికి ప్రాజెక్టు నీరు పారించుకుంటున్నాను. రెండు పంటలు పండుతుండడంతో శ్రమకు తగిన ఫలితం వస్తున్నది.

- కారెం లక్ష్మణ్, ఆయకట్టు రైతు, కుచులాపూర్

# బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థిని కలిసిన నాయకులు



బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌తో బీఆర్ఎస్ నాయకులు

సొనాల, డిసెంబర్ 2 : సొనాల మండలం దేవుల్‌నాయక్ తండా, చింతల్‌బోరి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం నేరడిగొండలో బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాదవ్ అనిల్ మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మొద్దని, ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పదిలంగా ఉన్నారని, మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునీత-రోహిదాస్, సర్పంచ్ సకారాం, ముండె ఈశ్వర్, కేంద్రె సంతోష్, జాదవ్ కృష్ణ, సచిన్, మాధవ్‌రావ్, గాంధీ, ఇందల్ సింగ్, బాబులాల్, గుర్జాల్ సింగ్, సుదర్శన్, ప్రదీప్ పాల్గొన్నారు.

# గెలుపుపై మూడు పార్టీల ధీమా

- పోలింగ్ బూతుల వారీగా లెక్కలు

బోథ్, డిసెంబర్ 2: బోథ్ నియోజకవర్గంలో పోటీ చేసిన ప్రధాన పార్టీ అభ్యర్థులు గెలుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ బూతుల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు జాదవ్ అనిల్, ఆడె గజేందర్, సోయం బాపురావు తమదంటే తమదే గెలుపని కలిసిన నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నారు. నియోజకవర్గం పరిధిలోని మొత్తం 2,08,048 మంది ఓటర్లకు గాను 1,72,397 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల ఆయా పార్టీల నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా నమోదైన పోలింగ్ వివరాలతో అభ్యర్థుల దగ్గరికి వెళ్లి లెక్కలు వేస్తున్నారు. సామాజిక వర్గాల వారిగా పడ్డ ఓట్లు, అనుకూల, వ్యతిరేక ఓట్ల అంచనాలు వేసుకుంటున్నారు. ఆదివాసీ, లంబాడా వర్గాల ఓట్లు తమకంటే తమకు ఎక్కువ మోతాదులో పడ్డాయని తమదే గెలుపని భరోసాతో ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో పాటు మహిళలు అధిక సంఖ్యలో ఓట్లు వేయడానికి రావడంతో గెలుపు గ్యారంటీ అని బీఆర్ఎస్ అభ్యర్థి జాదవ్ అనిల్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గంటల్లో ఫలితం తేలనుండడంతో అటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొని ఉంది.

### ఖానాపూర్ నియోజకవర్గంలో..

ఉట్నూర్, డిసెంబర్ 2 : శాసనసభ 2023 ఎన్నికల తుది తీర్పు ఆదివారం రానుంది. ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఎక్కడ చూసిన ఏ పార్టీ గెలుస్తోందన్న చర్చలు సాగుతున్నాయి. అలాగే అభ్యర్థులు కూడ తమకు ఏ ప్రాంతం నుంచి ఎన్ని ఓట్లు వచ్చాయన్న లెక్కలలో మునిగి విజయ అవకాశాలపై బిజీగా ఉన్నారు.

### మహిళా ఓటర్లదే హవా

నేడు నిర్మల్ జిల్లా కేంద్రంగా ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అయితే ఈ శాసనసభ ఎన్నికలలో మహిళలదే హవా కొనసాగింది. నియోజకవర్గంలో 1,08,400 మంది పురుషులు, 1,12,112 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అయితే మహిళలు ఎక్కువ ఏ పార్టీకి మొగ్గు చూపారో ఆ పార్టీ గెలుస్తుందని అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలోని మండలాల వారీగా మహిళల ఓట్లు పరిశీలించినట్లయితే దస్తురాబాద్‌లో 6,505 మందికి గాను 5,652 మంది ఓట్లు వేశారు. ఇంద్రవెల్లి మండలంలో 15,476 మందికి గాను12,594 మంది, జన్నారంలో 21,925 మందికి గాను 17,361 మంది, కడెం మండలంలో 14,597 మందికి గాను11,941 మంది, ఖానాపూర్‌లో 20,786 మందికి గాను16,580 మంది, పెంబి మండలంలో 5,380 మందికి గాను4,458 మంది, సిరికొండ మండలంలో 2,901 మందికి గాను 2,511 మంది, ఉట్నూర్ మండలంలో 24,542 మందికి గాను18,617 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో మహిళా ఓటర్లపైనే ఆయా పార్టీలు నమ్మకం పెట్టుకున్నాయి. మహిళలు ఏ పార్టీ వైపు ఉంటే ఆ పార్టీ గెలుపు తథ్యమని నాయకులు భావిస్తున్నారు. దీంతో నేటి తీర్పు దాదాపు బీఆర్ఎస్ పార్టీ వైపే నని ఖానాపూర్ అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్ భావిస్తున్నారు.

## గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 2: గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని సర్పంచ్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం లక్కారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ ఆదాయం, ఖర్చు వివరాలను పంచాయతీ కార్యదర్శి జగదీశ్ వివరించారు. అనంతరం గ్రామ పంచాయతీలోని గ్రామాల కూడలిలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, మురుగు కాల్వలు, సీసీ రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. అనంతరం యువతకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోల సత్తన్న, భూమన్న, తులసీరాం, లింగాగౌడ్, లచ్చు, మహేందర్, విలాస్, బిక్కు, కేశవ్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



యువకులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ రాథోడ్ జనార్దన్

## జోగు రామన్నను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నతో జైనథ్ బీఆర్ఎస్ నాయకులు

జైనథ్, డిసెంబర్ 2 : జైనథ్ మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శనివారం ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నను కలిశారు. గ్రామాల్లో జరిగిన ఓటింగ్ సరళిని వివరించారు. గ్రామాల వారీగా బీఆర్ఎస్‌కు పడిన ఓట్ల వివరాలు తెలియజేశారు. బీఆర్ఎస్ ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం పని చేసినట్లు వివరించారు. దీంతోపాటు కౌఠ గ్రామానికి సంబంధించి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ ఎస్ లింగారెడ్డి, నాయకులు గణేశ్ యాదవ్, గడ్డం జగదీశ్ రెడ్డి, కోరడి ఆనంద్‌రావ్, రుక్మన్న, రాజు, సంజీవ, దేవన్న పాల్గొన్నారు.